క్లుప్తంగా

వైభవంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం శ్రావణ శుద్ధ ఏకాదశి (మతత్రయ ఏకాదశి) సందర్భంగా శుక్రవారం ఉదయం ఘనంగా జరిగింది. ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మూర్తులుగా అనివెట్టి మండపంలో కొలువు దీర్చారు. ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ కల్యాణం జరిపించారు. ఈవో ఎస్.చంద్రశేఖర్ సూచనల మేరకు కల్యాణ సేవకు హాజరైన భక్త దంపతులకు శేషవస్త్రాలు, తలంబ్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా, శ్రావణ శుక్రవారం కావడంతో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు

శ్రీకాకుళం కల్చరల్ : సమాజ సేవకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. పీఎన్ కాలనీకి చెందిన జె.లక్ష్మణరావు ఇటీవల క్యాన్సర్‌తో మృతిచెందడంతో ఆయన కుటుంబానికి ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ద్వారా సేకరించిన రూ.45 వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించారు. పాతపట్నానికి చెందిన సైలాడ సతీష్, తన మిత్ర బృందంతో కలిసి ఈ సొమ్ము సేకరించారు. పిల్లల చదువులకు కూడా పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నంది ఉమాశంకర్, ఉర్లం శివతేజ, పొడుగు చరణ్, బొట్టా సాయి, రత్నాల మహాలక్ష్మి, అల్లాడ నవీన్, జాడ సాయి, సుప్రజా రౌత్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి అవకాశం



మాట్లాడుతున్న ఎంఈవో మురళీకృష్ణ

ఎచ్చెర్ల: ఓపెన్ స్కూల్ విధానం ద్వారా టెన్త్, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని లావేరు ఎంఈవోలు ఎల్.ఈశ్వరరావు, మజ్జి మురళీకృష్ణారావులు తెలిపారు. లావేరు మండల పరిషత్ సమావేశ మందిరంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, సీఆర్‌ఎంటీ, స్వయం సహాయక సంఘాల మహిళలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 14 సంవత్సరాలు నిండి చదవడం, రాయడం తెలిసినటువంటి చదువు మానేసిన విద్యార్థులు నేరుగా ఏపీ ఓపెన్ సొసైటీలో పదవ తరగతి, 15 సంవత్సరాలు నిండినవారు ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 27వ తేదీ వరకూ ఎటువంటి రుసుం లేకుండా ప్రవేశాలు పొందవచ్చునన్నారు. ఆసక్తి ఉన్నవారిని గుర్తించి ప్రవేశాలు కల్పించాలని కోరారు.

ఈక్రాప్ నమోదు చేయించుకోవాలి



ఈక్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి ఈక్రాప్ నమోదు చేస్తున్నామని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు చెప్పారు. సంతవురిటి గ్రామంలో ఈక్రాప్ నమోదు ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. రైతులు కచ్చితంగా ఈక్రాప్ నమోదు. చేయించుకోవాలని సూచించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ అలుగోలు లక్ష్మీనారాయణ, రైతులు ఉన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం



శిక్షణ ప్రవేశ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరంలో విద్యార్థుల కోసం హెచ్‌ఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కేంద్రం ప్రారంభించిన తేజాబాబు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మణి, ఎంపీటీసీ సభ్యురాలు స్వాతి, స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పార్థసారథి పాల్గొన్నారు.



నైరా పరిసర ప్రాంతంలో ఇసుక పోగులు



కిల్లిపాలెం, కల్లేపల్లి మీదుగా రాత్రివేళ టైరుబండి ద్వారా ఇసుక రవాణా

ఆగని ఇసుక దందా

ఇసుక అక్రమ రవాణా శ్రీకాకుళం మండల పరిధిలో యథేచ్ఛగా కొనసాగుతోంది. పొన్నాం, నైరా, బట్టేరు, రోణంకి, కరజాడ, అలికాం పరిసర ప్రాంతాల్లో టీడీపీ నాయకుల కనుసైగల్లోనే ఇసుక దందా జరుగుతోంది. ఇటీవల తహశీల్దార్ సమక్షంలో కొన్ని బృందాలను పెట్టినా అవి నామమాత్రంగానే చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక రవాణా విధానంపై స్పష్టమైన ఆదేశాలు వచ్చే వరకు ఇసుక రవాణా చేయకూడదన్న నిబంధనలు ఉన్నా వాటిని తుంగలోకి తొక్కేస్తున్నారు.

– శ్రీకాకుళం రూరల్



అలికాం పంచాయతీ నక్కపేట వద్ద నిల్వచేసిన ఇసుక పోగులు



శ్రీకాకుళం నగరంలోని రాత్రిపూట టైర్‌బండి ద్వారా ఇసుక రవాణా



రోణంకి పరిసర ప్రాంతంలో ఇసుకను తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్న లారీలు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి రేవతి

ఎచ్చెర్ల క్యాంపస: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన అవసరమని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అధికారి పి.రేవతి అన్నారు. తమ్మినాయుడుపేటలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించాలన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల రహిత వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. జీవామృతం, కషాయాలు వినియోగం తప్పనిసరిగా అనుసరించాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం వల్ల యాజమాన్య ఖర్చులు తగ్గటం, ఆరోగ్యకరమైన ఆహార పంటలు అందుబాటులోకి రావటం, మెరుగైన దిగుబడులు సాధ్యమన్నారు. వరి, కూరగాయలు, ఉద్యానవన సాగు వంటి వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు. కార్యక్రమంలో రీజనల్ ప్రకృతి వ్యవసాయ అధికారులు ప్రకాష్, హేమసుందర్, డీపీఎం ధనుంజయ్ ఉన్నారు.

జిల్లాక్రికెట్ సంఘ సభ్యుడు హరకేశవ్ మృతికి సంతాపం



హరకేశవ్(ఫైల్)

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా క్రికెట్ సంఘ సభ్యులు, సీనియర్ క్రికెటర్ ఎల్లూర్ హరకేశవ్(68) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. సీనియర్ క్రికెటర్‌గా ఎంతో గుర్తింపు పొందిన ఈయన వీనస్ హోటల్ యజమానిగా గౌరవాన్ని అందుకున్నారు. ఈయన మృతిపట్ల జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు పీఎల్‌ఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ, రవికుమార్, సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు ప్రగాఢ సంతాపం తెలిపారు.

తలసేమియా బాధితులకు కిట్లు పంపిణీ



చిన్నారులకు కిట్లు అందజేస్తున్న శ్రీను, నవీన్

శ్రీకాకుళం: చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో తలసేమియా చిన్నారులకు అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను పౌష్టికాహారం కిట్లు, పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో న్యూట్రీషియన్ కోచ్ నాగరాజు, రామ్‌చరణ్ యువ శక్తి జిల్లా అధ్యక్షుడు మజ్జి గౌతమ్, గోవింద, ఆలిండియా అల్లు అర్జున్ ఫ్యాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుక్కల నవీన్, భాను, గిరి పాల్గొన్నారు.

చెట్లను తొలగించాలని విజ్ఞప్తి



ఇళ్ల ముందు ఉన్న భారీ చెట్లు

ఎచ్చెర్ల: చిలకపాలెం గ్రామంలోని పొందూరు వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న భారీ మర్రి చెట్లను తొలగించాలని ఇక్కడ దివ్యాంగుల కాలనీ వాసులు కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా నివాసాలు ఉంటున్న వీరంతా చెట్లతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. చెట్ల వేళ్ల కారణంగా తమ ఇంటి గోడలు బీటలు వారుతున్నాయని చెబుతున్నారు. అలాగే చెట్ల ఊడలు ఇళ్లపైకి పడుతున్నట్లు చెప్పారు. వర్షాకాలం కావడంతో చెట్లు విరిగి పడిపోయే ప్రమాదం ఉందని భయాందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే!

పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ప్రతి ఇంటా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారు ఆభరణాలు, గులాబీ, చేమంతి పూలతో అందంగా అలంకరించారు. రకరకాల పిండి వంటలతో నైవేద్యం పెట్టారు. అనంతరం ఆలయాలకు అమ్మవారిని దర్శించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి పెద్దమందిరంలో సామూహిక పూజలు



శ్రీకాకుళం కల్చరల్: బాకర్‌సాహెబ్‌పేటలో దుర్గామహాలక్ష్మి అలంకరణ



ఎచ్చెర్ల క్యాంపస్: దేవీపీఠంలోని శ్రీచక్రాలు వద్ద కుంకుమార్చన పూజలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఇండస్ట్రియల్, కొత్తపేట ఫీడర్ల పరిధిలో శనివారం కరెంటును నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.భయ్యన్నాయుడు శుక్రవారం తెలిపారు. 11 కేవీ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు చర్యల్లో భాగంగా ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తమ్మినాయుడుపేట, సలపలవానిపేట, ఇబ్రహింబాద్, పూడివలస, కొత్తపేట, వెంకన్నగారిపేట, తెప్పరేవు, దోమాం, పెయిలవానిపేట, దుప్పలవలస, ఫరీదుపేట, నవభారత్ ఇండస్ట్రియల్ ఏరియా, వరం కాలనీ, టీచర్స్ కాలనీలకు సరఫరా ఉండదని..వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అభివృద్ధికి సహకరించాలి

జి.సిగడాం: గ్రంథాలయాల అభివృద్ధికి అందరూ సహకరించాలని విజయనగరం జిల్లా ఏపీ సీపీఎస్‌ఈఏ శాఖ కార్యదర్శి కోరికాన శంకరరావు అన్నారు. నిద్దాం గ్రామంలో చేయూత యువజన గ్రంథాలయం ఆవరణలో విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు, యువతీ, యువకులు, ఉద్యోగస్తులు, విశ్రాంత ఉద్యోగస్తులు గ్రంథాలయాభివృద్ధికి తమ వంతు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ప్రతినిధులు కోరిగాన శ్రీనివాసరావు, కెంబూరు ప్రతాప్ చౌరి సూరి, కెంబూరు చిన్న సూరి పాల్గొన్నారు.

జీతాల బిల్లు సకాలంలో పంపాలి

గార: మండలంలోని ఎంటీఎస్ (మినిమమ్ టైమ్ స్కేల్) ఉపాధ్యాయుల జీతాలు బిల్లును ట్రెజరీకి సకాలంలో పంపాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురువు గోవిందరావు, చిట్టి త్రినాథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈవో నక్క రామకృష్ణకు వినతిపత్రం అందించారు. ప్రతి నెలా 17 నుంచి 25వ తేదీలోగా బిల్లును పంపించడంలో జాప్యం జరుగుతోందన్నారు. దీంతో రెగ్యులర్ ఉపాధ్యాయులతో జీతాలు అందుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని మండలాల్లో రెగ్యులర్ టీచర్లతో జీతాలు అందుతున్నా.. గార మండలంలో ఆలస్యమవుతోందని చెప్పారు.

నేడు బైక్ ర్యాలీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని కోరుతూ దళిత మహాసభ ఆధ్వర్యంలో శనివారం ఉదయం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధి బెంజిమెన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆదివారంపేట నుంచి ప్రారంభమై డే అండ్ నైట్, ఏడు రోడ్లు కూడలి, సూర్యమహల్ సెంటర్, రైతు బజార్, అంబేడ్కర్ విజ్ఞాన భవనం వరకు ర్యాలీ సాగుతుందని వివరించారు. అందరూ హాజరుకావాలని కోరారు.

భారీ వాహనాలతో ఇబ్బందులు



రాజాం-పొందూరు ప్రధాన రహదారిలో భారీ ట్యాంకర్ లారీ

జి.సిగడాం: పొందూరు-రాజాం ప్రధాన రహదారిలో భారీ వాహనాలు తిరుగుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. విశాఖపట్నం నుంచి ఒడిశాకు 60 టైర్లతో ఉన్న ట్యాంకర్లు పరిశ్రమలకు సంబంధించిన ముడిసరకును తీసుకొని వెళ్తున్నాయి. శుక్రవారం పొందూరు-రాజాం ప్రధాన రహదారిలో ఉన్న మర్రివలస గ్రామ సమీపంలో మూడు భారీ లారీలు ఒకేసారి రావడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోల్లో ప్రయాణిస్తున్నవారు వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు.

బొత్సను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణతో జిల్లా నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి శుక్రవారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో అల్లు లక్ష్మీనారాయణ, బాన్న నరసింగరావు, బాన్న రవణమూర్తి ఉన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు దుస్తుల వితరణ



క్రీడాకారుల బృందంతో నిర్వాహకులు, అతిథులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ఆతిథ్యంలో జరగనున్న రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజయకేతనం ఎగురవేయాలని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు పిలుపునిచ్చారు. సన్‌రైజ్ హాస్పిటల్ ఎండీ, లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ కోచ్ మేనేజర్లతో కలిసి 38 మంది క్రీడాకారుల బృందానికి రూ.10వేల విలువైన క్రీడాదుస్తులు శుక్రవారం అందజేశారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ సంఘ ప్రతినిధులు మొజ్జాడ వెంకటరమణ, మెట్ట తిరుపతిరావు, బొడ్డేపల్లి సురేష్, అన్నెపు రాజగోపాల్, ఒలింపిక్ సంఘ సలహాదారు పి.సుందరరావు, బీవీ రమణ, సూరిబాబు, సాదు శ్రీనివాస్, పేడాడ బాబూరావు, జి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తి గౌతు లచ్చన్న



లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: స్వాతంత్య్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ గౌతు లచ్చన్న ఆదర్శప్రాయుడని కేంద్ర శ్రీశయన సంఘం అధ్యక్షుడు వంగా మహేష్ దేవ్ అన్నారు. గౌతు లచ్చన్న 1జయంతి సందర్భంగా స్వాతంత్య్ర సమరయోధుల స్మృతి వనం గాంధీమందిరంలో శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శ్రీశయన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోడ అప్పారావు, గాంధీ మందిర కమిటీ సభ్యులు కొంక్యాన వేణుగోపాల్, శ్రీశయన సంఘ పెద్దలు మండల మన్మథరావు, లొట్టి సూరిబాబు, మెండ శ్రీనివాసరావు, పోలాకి చిన్నారావు, ఎర్ర ఆదినారాయణ, డొంకాడ అసిరినాయుడు, గాంధీ మందిరం కమిటీ ప్రతినిధులు డాక్టర్ జామి భీమశంకర్, కొంక్యాన మురళీధర్, పందిరి అప్పారావు, నక్క శంకరరావు, కొమ్ము రమణమూర్తి, పైడి హరనాథరావు, ఎంవిఎస్ఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా అందరూ అభిమానించే నేత సర్దార్ గౌతు లచ్చన్న అని ఇంటాక్ కో-కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ డిప్యూటీ గవర్నర్ శాసపు జోగినాయుడు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



మహిళలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: రాష్ట్రంలో రైతులు, మహిళల ఆర్థిక అభివృద్ధికి ఎన్నో సహాయ కార్యక్రమాలు చేపడుతున్నామని సమగ్ర శిశు, మహిళ అభివృద్ధి సేవా సంస్థ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. కొవ్వాడ పంచాయతీలో ఐసీడబ్ల్యూడీఎస్ ఆధ్వర్యంలో చిన్న తరహా రుణాల కల్పనలో భాగంగా పలువురు మహిళలకు ఉచితంగా నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలసల నివారణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 56 వేల మహిళా బృందాలకు స్వయం ఉపాధి కల్పించామని చెప్పారు. మహిళల స్వయం ఆర్థిక అభివృద్ధికి సహకరించేలా, జీవనోపాధికి ఉపయోగపడేలా వివిధ రకాల వస్తు ఉత్పత్తి శిక్షణ, చిన్న తరహా పరిశ్రమ స్థాపనకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కొవ్వాడ సర్పంచ్ రాముడు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జి.శ్రీనివాసరావు, డివిజినల్ మేనేజర్ కృష్ణ, రణస్థలం, ఎచ్చెర్ల మండలాల కోఆర్డినేటర్లు రాజు, ఈశ్వరరావు ఉన్నారు.

శ్యాంపిస్టన్స్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



శ్యాంపిస్టన్స్ జీఎం కిశోర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలోని అరిణాం అక్కివలస, వరిసాంలో గల శ్యాంపిస్టన్స్ అండ్ రింగ్స్ పరిశ్రమలోని కార్మికుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని ఆ పరిశ్రమ జనరల్ మేనేజర్ కిశోర్ ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు హామీ ఇచ్చారు. బంటుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఈశ్వరరావుతో జీఎం కిశోర్ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్మికుల 30 సంవత్సరాల ఉద్యోగ విరమణ గడుపు పెంపునకు, ఉత్పత్తి, కార్మికుల ఇతర అలవెన్సులపై సమీక్షించారు. ఇప్పటికే ఉద్యోగ వీరమణ అంశం న్యాయస్థాన పరిధిలో ఉందని వివరించారు. త్వరలో పరిశ్రమ బోర్డు సమావేశం నిర్వహించి సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.

మెరుగైన ప్రదర్శనకు ప్రశంసలు



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఎస్‌ఐ నీలమ, ఎస్‌ఐ అక్షయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శేషాద్రి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలో గురువారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో పోలీసు కవాతులో మెరుగైన ప్రదర్శనతో ప్రతిభ చూపిన జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వీరికి ప్రశంసాపత్రాలు అందించారు. వీటితో పాటు ఉద్యోగి సర్వీస్ రిజిస్టర్‌లో గుడ్ సర్వీస్ ఎంట్రీ (జీఎస్‌ఈ) నమోదు చేయాలని కార్యాలయ సిబ్బందికి ఆదేశించారు. ప్రశంసాపత్రాలు అందుకున్నవారిలో పరేడ్ కమాండర్ డీఎస్పీ ఎల్.శేషాద్రినాయుడు, ప్లటూన్ కమాండర్లయిన ఆర్‌ఎస్‌లు అక్షయ్‌కుమార్, నీలిమతో పాటు 64 మంది పోలీసు సిబ్బంది, హోంగార్డులున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com